

# ఏదీ అడగను..ఇచ్చిందే తీసుకుంటా!

'సంక్రాంతికి వస్తున్నాం' అపూర్వ విజయంపై చిత్ర కథానాయకుడు వెంకటేష్ ఆనందం వ్యక్తం చేశారు. అందరూ సినిమాను ట్రిపుల్ బ్లాక్‌బస్టర్ హిట్ అంటున్నారని చెప్పారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 200కోట్ల వసూళ్లను దాటి బాక్సాఫీస్ బరిలో దూసుకుపోతున్నది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెంకటేష్, చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో పాల్గొన్నారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానమిచ్చారు. ఈ సినిమా చేస్తున్నప్పుడే పాజిటివ్‌గా అనిపించిందని, షూటింగ్ మొత్తం ఓ మ్యాజికల్ జర్నీలా సాగిందని వెంకటేష్ చెప్పారు. 'ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేసుంటే ఇంకా భారీ విజయం దక్కేది కదా?' అనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ 'నేను జీవితంలో ఎప్పుడూ ఏదీ అడగను. నా దగ్గరకు వచ్చిందే తీసుకుంటా. నిజానికి ఈ విజయమే నాకు పెద్ద బోనస్' అని బదులిచ్చారు. పదో రోజు కూడా అద్భుతమైన కలెక్షన్స్ సాధిస్తున్నదని, కుటుంబ కథా చిత్రాలకున్న బలాన్ని మరోమారు ఈ సినిమా చాటిచెప్పిందని దర్శకుడు అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా తాను ప్రతి గడపకు చేరుకున్నానని, అమ్మలాంటి అందమైన జ్ఞాపకమిదని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఆనందం వ్యక్తం చేశారు.

**నేను వైట్ వైట్:** ఈ సమావేశంలో సినీ ప్రముఖుల ఇళ్లపై జరుగుతున్న ఐటీ రైడ్స్ గురించి స్పందించమని వెంకటేష్‌ను కోరగా 'ఐటీ రైడ్స్ జరుగుతున్నాయా? నిజమా? ఆ విషయం నాకు తెలియదు. మిగతా వాళ్ల విషయాన్ని పక్కనపెడితే.. నేను పారితోషికం మొత్తం వైట్‌లోనే తీసుకుంటా. నేను వైట్ వైట్. నా రెమ్యునరేషన్ కూడా తక్కువే కదా' అని వెంకటేష్ అన్నారు.

# రామ్‌గోపాల్‌వర్మకు జైలు శిక్ష



నిత్యం వివాదాలతో సహవాసం చేసే ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మరోమారు చిక్కుల్లో పడ్డారు. 2018 నాటి చెక్‌బౌన్స్ కేసులో ముంబయిలోని అంధేరి కోర్టు ఆయనకు మూడు నెలల జైలుశిక్ష విధించింది. ఈ కేసు విచారణకు రామ్‌గోపాల్‌వర్మ గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం ఆయనపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసింది. 2018లో మహేంద్ర మిశ్రా అనే వ్యక్తి తరఫున ఓ కంపెనీ ఈ కేసు దాఖలు చేసింది. 2022 జూన్‌లో వర్మ ఈ కేసు విషయంలో బెయిల్ తెచ్చుకున్నారు. కోర్టు తీర్పుపై రామ్‌గోపాల్‌వర్మ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తన మాజీ ఉద్యోగికి సంబంధించిన కేసు ఇదని, తన న్యాయవాదులు ఈ కేసును చూసుకుంటారని, కోర్టులో కేసు ఉన్నందు వల్ల తీర్పుపై తానేమీ మాట్లాడబోనని పేర్కొన్నారు.

# నా రికార్డులన్నీ ఒరిజినల్!

'ఈ సినిమా కోసం ఎంతో పరిశోధన చేశాం. 'ఆదిత్య 369'లో నేను పోషించిన కృష్ణదేవరాయలు పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. అలాంటి గుర్తుండిపోయే పాత్ర చేయాలనే ఆలోచన నుంచే డాకు మహారాజ్ క్యారెక్టర్ పుట్టింది' అన్నారు అగ్ర నటుడు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ రూపొందించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి..విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది. ఈ నేపథ్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అనంతపురంలో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమా విషయంలో డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అందరూ సంతోషంగా ఉన్నారు. నేను కలెక్షన్స్ గురించి అంతగా పట్టించుకోను. అభిమానులే నా ప్రచారకర్తలు. వాళ్లకు తెలుసు నా కలెక్షన్స్, రికార్డులన్నీ ఒరిజినల్ అని' అన్నారు. 'నేను చిరంజీవిగారి అభిమానినని చెప్పినా బాలకృష్ణగారు నన్ను దర్శకుడిగా ప్రోత్సహించారు. ఆయనకు నిజాయితీ అంటే ఇష్టం. అబద్ధాలకు ఆయన దగ్గర చోటులేదు' అని దర్శకుడు బాబీ కొల్లి తెలిపారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారిని చూస్తేనే ఎనర్జీ వస్తుంది. అందుకే ఉత్సాహంగా సంగీతం చేశాను. 'భైరవద్వీపం' సినిమాకు డ్రమ్స్ వాయిస్తూ రోజుకి 30 రూపాయలు తీసుకుంటూ కెరీర్ ఆరంభించాను. ఇప్పుడు ఆయన సినిమాకు మ్యూజిక్ అందించడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయికలు శ్రద్ధాశ్రీనాథ్, ఊర్వశి రౌతేలాతో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.








# నాన్‌స్టాప్ అడ్వెంచర్



మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిస్తున్న గ్లోబల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇటీవలే హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటికే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టిన రాజమౌళి కొన్ని కీలక సన్నివేశాలను కూడా తెరకెక్కించినట్లు తెలిసింది. ఇందుకోసం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఓ సెట్‌ను తీర్చిదిద్దారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను ఈ నెలాఖరులో మొదలుపెట్టబోతున్నారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని నాన్‌స్టాప్ షెడ్యూళ్లతో శరవేగంగా పూర్తి చేయాలనే ఆలోచనలో రాజమౌళి ఉన్నారట. ఇక ఈ చిత్రంలో కథానాయికగా ప్రియాంక చోప్రాను ఎంపిక చేశారనే వార్తలు సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారమవుతున్నాయి. ఆమె ఇప్పటికే హైదరాబాద్‌కు విచ్చేయడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. నాయికగా ప్రియాంక చోప్రా ఎంపిక దాదాపు ఖరారైందని, ఆమె బల్క్ డేట్స్ కోసం రాజమౌళి ప్రయత్నిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి కీరవాణి సంగీతాన్నందిస్తుండగా, దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.



# ఇంతకుమించి ఏం కావాలి?

'ఛావా' చిత్రంలో మహారాణి యేసుబాయి పాత్రను పోషించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని, ఇలాంటి పాత్ర చేసిన తర్వాత ఇక తాను సినిమాల నుంచి రిటైర్ అయినా సంతోషమేనని వ్యాఖ్యానించింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. మరాఠీ యోధుడు ఛత్రపతి శంభాజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'ఛావా' చిత్రంలో ఆమె మహారాణి యేసుబాయి పాత్రను పోషించిన విషయం తెలిసిందే. విక్కీ కౌశల్ ఛత్రపతి శంభాజీగా కనిపించనున్నారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ముంబయిలో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రష్మిక మందన్న మాట్లాడుతూ 'నా కెరీర్ అత్యంత విశిష్టమైన పాత్ర ఇది. ఇలాంటి పాత్ర దక్కడం గౌరవంగా భావిస్తున్నా. ఓ నటిగా నాకు ఇంతకుమించి ఏం కావాలి?. ఈ సినిమా షూటింగ్ సమయంలో చాలా సార్లు భావోద్వేగానికి గురయ్యా. ఒక్కోసారి కన్నీళ్లొచ్చేవి. ఈ సినిమాలోని పాత్రలు ప్రతీ ఒక్కరికి స్ఫూర్తినిస్తాయి' అని రష్మిక మందన్న చెప్పింది. జిమ్ వర్కవుట్స్ సందర్భంగా ఇటీవల రష్మిక మందన్న కాలికి గాయమైన విషయం తెలిసిందే. 'ఛావా' ట్రైలర్ రిలీజ్ వేడుకకు ఆమె గాయంతోనే హాజరయ్యారు. వేదికపై రష్మిక నడవడానికి విక్కీ కౌశల్ సాయం చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'ఛావా' చిత్రం దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ కానుంది.

# గడియారంలో సెకనుల ముల్లు గంటకు కదిలిందే..

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్' నుంచి 'హైలెస్సో హైలెస్సా..' అనే మూడో గీతాన్ని గురువారం విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ గీతానికి శ్రీమణి సాహిత్యాన్నందించారు. శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ ఆలపించారు. 'ఎంతెంత దూరాన్ని నువ్వూ నేనూ మోస్తూ ఉన్నా అసలింత అలుపే రాదు..ఎన్నెన్ని తీరాలు నీకూ నాకు మధ్యన ఉన్నా కాస్తయినా అడ్డే కాదు. నీతో ఉంటే తెలియదు సమయం..నీవు లేకుండా ఎంత అన్యాయం గడియారంలో సెకనుల ముల్లే గంటకు కదిలిందే.. నీతో ఉంటే కరిగే కాలం..నువు లేకుంటే కదలదు కాలం అని నెలలో ఉండే తేదీ కూడా డాదయ్యిందే..హైలెస్సో..' అంటూ నాయకానాయికల మధ్య ఉండే అనురాగాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. సముద్ర నేపథ్యంలోని విజువల్స్ కట్టిపడేసేలా ఉన్నాయి. నాగచైతన్య, సాయిపల్లవి మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలిచింది. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ప్రేమ, దేశభక్తి ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.



# మా నాన్నే గుర్తుపట్టలేదు




'ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. నా విష్‌లిస్ట్‌లో ఉన్న సినిమా ఇది. దర్శకుడు కథ చెప్పిన వెంటనే 'సినిమా చేస్తున్నాం' అని చెప్పా. వాలెంటైన్ డే రోజు బ్యాచిలర్స్ అందరూ తమకు ఎవరూ తోడు లేరని బాధపడుతుంటారు. కానీ ఈ ప్రేమికుల రోజున మీకు లైలా తోడుంటుంది' అన్నారు విశ్వక్‌సేన్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్షశర్మ కథానాయిక. ఫిబ్రవరి 14న విడుదలకానుంది. ఈ సినిమాలోని 'ఇచ్చుకుందాం బేబీ..' అనే పాటను గురువారం లాంచ్ చేశారు. లియోన్ జేమ్స్ స్వరపరచిన ఈ పాటను పూర్ణాచారి రచించారు. ఆదిత్య ఆర్కే, మానసి ఆలపించారు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో లైలా పాత్ర కోసం మేకప్‌కే రెండు గంటలు పట్టేదని, ఓసారి షూటింగ్ లొకేషన్ నుంచి లైలా గెటప్‌లో తన నాన్నకు వీడియో కాల్ చేస్తే ఆయన గుర్తుపట్టలేదని విశ్వక్‌సేన్ అన్నారు. ఈ కథను కొందరు హీరోలకు చెబితే..లేడీ గెటప్ వేయాల్సిరావడం వల్ల ఒప్పుకోలేదని, విశ్వక్‌సేన్ వల్లే ఈ పాత్రను తెరకెక్కించగలిగానని దర్శకుడు తెలిపారు. విశ్వక్‌సేన్ కెరీర్‌లో నిలిచిపోయే పాత్ర ఇదని నిర్మాత సాహు గారపాటి పేర్కొన్నారు.

# ఆస్కార్ బరిలో భారతీయ చిత్రం 'అనూజ'

## 'ఎమిలియా పెరెజ్'కు 13 నామినేషన్లు • మార్చి 2న అవార్డుల ప్రదానం

ఆస్కార్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మనదేశం నుంచి 'అనూజ' చిత్రం షార్ట్‌లిస్ట్ అయిన విషయం తెలిసిందే. గునీత్ మోంగా కపూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించారు. గురువారం ప్రకటించిన 2025 ఆస్కార్ పురస్కారాల నామినేషన్ జాబితాలో ఈ సినిమా చోటు దక్కించుకుంది. ఈ చిత్రానికి అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుండటం విశేషం. 97వ ఆస్కార్ అవార్డుల కోసం నామినేషన్ దక్కించుకున్న సినిమాల వివరాలను గురువారం వెల్లడించారు. మార్చి 2న లాస్‌ఏంజిల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో ఈ అవార్డుల ప్రదానం జరగనుంది.



### స్ఫూర్తిదాయక కథతో 'అనూజ'

న్యూఢిల్లీలోని బట్టల మిల్లులో తన సోదరితో కలిసి పనిచేసే తొమ్మిదేళ్ల బాలిక అనూజ నేపథ్యంలో ఈ లఘు చిత్రాన్ని తెరకెక్కించారు. చిన్న వయసులోనే కుటుంబ భారాన్ని మోస్తూ బోర్డింగ్ స్కూల్‌లో విద్యనభ్యసించాలని తపించే అనూజ ఎన్నో అవరోధాలను అధిగమించి తన కలను ఎలా నెరవేర్చుకుందన్నదే ఈ లఘు చిత్ర ఇతివృత్తం. నిర్మాత గునీత్‌మోంగా కపూర్ నిర్మించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' చిత్రం 2023 ఆస్కార్ పురస్కారాల్లో బెస్ట్ డాక్యుమెంటరీగా అవార్డు గెలుచుకోవడ విశేషం. లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ కేటగిరీలో అనూజతో పాటు ఏలియన్, అయామ్ నాట్ ఏ రోబోట్, ది లాస్ట్ రేంజర్, ది మ్యాన్ హూ కుడ్‌నాట్ రిమైన్ సైలెంట్ అనే చిత్రాలు పోటీలో ఉన్నాయి.

### బెస్ట్ ఫిల్మ్ కేటగిరిలో పది చిత్రాలు

ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల్లో ఉత్తమ చిత్రం విభాగంలో పది చిత్రాలు నామినేషన్ దక్కించుకున్నాయి. అనోరా, ది బ్రూటలిస్ట్, ఏ కంప్లీట్ అన్‌నౌన్, కాంక్లేవ్, డ్యూన్-2, ఎమిలియా పెరెజ్, ఏ రియల్ పెయిన్, సింగ్ సింగ్, ది సబ్‌స్టాన్స్, విక్కడ్ చిత్రాలు రేసులో పోటీపడుతున్నాయి. ఇందులో 'ఎమిలియా పెరెజ్' చిత్రం మొత్తం పదమూడు నామినేషన్స్ సాధించి ఆస్కార్ రేసులో అగ్ర భాగాన నిలిచింది. గతంలో ఆల్ ఏబౌట్ ఈవ్ (1950), టైటానిక్ (1997), లా లా లాండ్ (2016) చిత్రాలు పద్నాలుగు విభాగాల్లో నామినేషన్స్ దక్కించుకొని రికార్డు సృష్టించాయి. ఇప్పుడు 13 నామినేషన్స్‌తో 'ఎమిలియా పెరెజ్' వార్తల్లో నిలిచింది. ఈ చిత్రాన్ని అమెరికన్ ఫ్రెంచ్ మ్యూజికల్ క్రైమ్ కామెడీ మూవీగా తెరకెక్కించారు. జాక్వీయస్ ఆడియార్డ్ దర్శకత్వం వహించారు.


